

సోమశిలలో 55.080 టీఎంసీలు
సోమశిల: జలాశయంలో మంగళవారం 55.080 టీఎంసీల నీరు నిల్వ ఉంది. వివిధ కాలువలకు 1450 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10గ్రాములు)	రూ.91,330
22 క్యారెట్లు ఆర్నమెంట్ (1 గ్రా)	రూ.8,261
3శాతం జీఎస్టీతో	రూ.8,509
నవర (8గ్రా)	రూ.68,072

వాతావరణం
గరిష్టం/కనిష్టం 35.5 /25.7
బుధవారం జిల్లాలో వాతావరణం పొడిగానే ఉంటుందని ఆ శాఖ అధికారులు తెలిపారు. గాలిలో తేమ మంగళవారం 70 శాతంగా నమోదైంది.

రంజాన్ వేళలు

ఇఫ్తార్	సహర్
బుధవారం	గురువారం
సా: 6.22	ఉ: 4.54

న్యూస్‌రీల్

రథం ఘటనలో కేసు నమోదుపై సందిగ్ధం?

బిట్రగుంట: కొండబిట్రగుంట బిలకూట క్షేత్రం రథోత్సవం అపశృతి వెనుక కుట్రకోణం ఉందంటూ ఆలయ ఈఓ రాధాకృష్ణ చేసిన ఫిర్యాదుపై సందిగ్ధత నెలకొంది. ఆలయ అధికారుల నిర్లక్ష్యం, బాధ్యతారాహిత్యం కారణంగా రథోత్సవం నిలిచిపోయిన విషయం తెలిసిందే. రథాన్ని ముందుగా పరిశీలించకుండా, ట్రయల్ రన్ నిర్వహించకుండా రథోత్సవం ప్రారంభించడంతో 20 అడుగులు కూడా ముందుకు కదలకముందే చక్రాల బేరింగ్ సిస్టంలో సమస్యలు తలెత్తి రథం ఆగిపోయింది. దీంతో భక్తులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ ఈఓకు, ఆయన సోదరుడికి వ్యతిరేకంగా నినాదాలు చేయడం, జిల్లా వ్యాప్తంగా భక్తుల నుంచి వ్యతిరేకత వ్యక్తమవడంతో దేవదాయశాఖ తమ తప్పిదాలను కప్పిపుచ్చుకునేందుకు కుట్ర కోణాన్ని తెర మీదకు తీసుకువచ్చింది. ఈ మేరకు ఈఓ రాధాకృష్ణ ఆదివారమే బిట్రగుంట పోలీస్‌స్టేషన్‌లో కుట్ర కోణంపై అనుమానాలు వ్యక్తం చేస్తూ ఫిర్యాదు చేశారు. సరైన ఆధారాలు లేకపోవడంతోపాటు భక్తులను అలజడికి గురిచేసే సున్నితమైన అంశం కావడంతో మంగళవారం సాయంత్రం వరకు పోలీసులు కేసు నమోదు చేయలేదు. ఉన్నతాధికారుల అనుమతితో కేసు నమోదు చేసే విషయాన్ని పరిశీలిస్తున్నారు. మరో వైపు ఈఓకు, ఆయన సోదరుడికి వ్యతిరేకంగా పాతబిట్రగుంట, కొండబిట్రగుంట గ్రామస్తులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూనే ఉన్నారు. ఈఓపైన, కొండపై తిష్టవేసిన అతని సోదరుడిపై దేవదాయశాఖ ఏసీకి ఫిర్యాదు చేశారు. అధికారులు స్పందించకపోతే శనివారం నుంచి కలెక్టరేట్ వద్ద నిరవధిక ధర్నా నిర్వహించేందుకు కూడా సిద్ధంగా ఉన్నట్లు తెలిసింది.

31 వరకు అఫిలియేషన్ల రెన్యూవల్

నెల్లూరు (టౌన్): 2025–26 విద్యా సంవత్సరానికి సంబంధించి ప్రైవేట్ జూనియర్ కళాశాలల ప్రొవిజనల్ అఫిలియేషన్ రెన్యూవల్ గడువును ఈ నెల 31వ తేదీ వరకు గడువు పెంచినట్లు ఆర్ఐఓ ఆదూరు శ్రీనివాసులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కోర్సులు మార్పిడి, కొత్త కోర్సులు, అదనపు సెక్షన్లు మంజూరు, ద్వితీయ భాష, మీడియం మార్పు అనుమతి, ఒక ప్రదేశం నుంచి మరొక ప్రదేశానికి కళాశాల తరలింపు, కళాశాల మూసివేత, మూసివేసిన కళాశాల పునః ప్రారంభం, కళాశాలల పేర్లు మార్పు తదితర వాటిని చేసుకోవచ్చన్నారు. ప్రైవేట్ జూనియర్ కళాశాలల యాజమాన్యాలు నిర్ణీత గడువు లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు.

ఎంఈఓ వ్యవహారంపై డిప్యూటీ డీఈఓ విచారణ

- ఆయన్ను కాపాడే యోచనలో అధికారులు
- విచారణకు వచ్చి ఎంఈఓ పెట్టిన భోజనాన్ని ఆరగించి వెళ్లిన వైనం



ఎంఈఓ దగ్గర లిఖిత పూర్వకంగా వివరణ తీసుకుంటున్న డిప్యూటీ డీఈఓ

సాక్షి ఎఫెక్ట్..

ఉలవపాడు: ఉలవపాడు ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం, ఎంఈఓ శివనాగేశ్వరరావు మద్యం మత్తులో తూగుతున్న వైనంపై కందుకూరు డిప్యూటీ డీఈఓ పీపీ నరసింహారావు మంగళవారం విచారణ చేపట్టారు. సాక్షిలో మంగళవారం 'మద్యం మత్తులో ఎంఈఓ' శీర్షికన ప్రచురితమైన కథనానికి విద్యాశాఖ స్పందించింది. డిప్యూటీ డీఈఓ పాఠశాలకు వచ్చి శివనాగేశ్వరరావుతో మాట్లాడారు. ఆయన వివరణ, ఉపాధ్యాయుల వివరణ తీసుకున్నారు. విచారణ నివేదికను డీఈఓకు అందజేస్తామన్నారు. అయితే మరో ఎంఈఓ, ఉపాధ్యాయులు శివనాగేశ్వరరావుపై మద్యం తీసుకుంటాడని లిఖిత పూర్వకంగా ఇవ్వలేమని స్పష్టం చేసిన్నట్లు తెలిసింది. దీంతో డిప్యూటీ డీఈఓ కూడా సదరు ఎంఈఓను మందలించారని సమాచారం. మద్యం తాగుతున్నట్లు కచ్చితమైన ఆధారాలు ఉన్నా ఎంఈఓను కాపాడే పనిలో విద్యాశాఖ విచారణ జరిగిందని తెలుస్తోంది. విచారణకు వచ్చిన అధికారి ఆరోపణలు ఎదుర్కొంటున్న ఎంఈఓతో భోజనం తెప్పించుకుని అక్కడే తిని వెళ్లడం చూస్తే.. ఈ విచారణ ఎంత పారదర్శకంగా జరిగిందో అర్థమవుతుంది.

- దగదర్తి ఎయిర్‌పోర్టు వ్యవహారం
- అబ్‌స్టికల్ లిమిటేషన్ సర్ఫేసెస్ సర్వే చేయాలంట
- తాజాగా ప్రకటించిన కేంద్ర ప్రభుత్వం
- 17 ఏళ్లుగా అనేక అడ్డంకులు, అవాంతరాలు


అప్పట్లో భూములిచ్చిన రైతులు నేడు పాలేర్లుగా..

అటు తిరిగి.. ఇటు తిరిగి మళ్లీ మొదటికి!



వ్యవసాయం లేక.. పాడి రైతుగా

ఈ ఫొటోలో ఉన్న వ్యక్తి పేరు పులి శీనయ్య. దామవరం గ్రామానికి చెందిన రైతు. తనకున్న పొలంలో వ్యవసాయం చేసుకుంటూ దర్జాగా బతికేవాడు. తన ఇద్దరు పిల్లలకు తన పొలాన్ని చెరి సగం ఇచ్చేస్తే వారు జీవితంలో స్థిరపడతారని ఆశ పడ్డాడు. 2016లో విమానాశ్రయం నిర్మాణానికి ఇతని భూములు తీసుకుని అప్పటి ధరల ప్రకారం నష్ట పరిహారం ఇచ్చారు. మధ్యలో టీడీపీ నేతలే దళారులుగా మారి తమ వాటా అంటూ ఇతని పరిహారం నగదులో సగం లాగేసుకున్నారు. మిగిలిన డబ్బుతో నాలుగు పశువులు కొనుగోలు చేసుకుని పాడి రైతుగా మారాడు. తన పొలంలో వ్యవసాయ పనులు చేసుకునే రైతు, విమానాశ్రయానికి భూమి ఇచ్చి.. ఇప్పుడు పశువులను పోషించుకుంటూ జీవనం సాగిస్తున్నాడు.



విమానాశ్రయం నిర్మాణానికి 2019 జనవరి 22న సీఎం చంద్రబాబు ఆవిష్కరించిన శంకుస్థాపన పైలాన్

జిల్లాలో నిర్మించ తలపెట్టిన దగదర్తి ఎయిర్‌పోర్టు వ్యవహారం మళ్లీ మొదటికొచ్చింది. చెన్నై–కోల్‌కత్తా జాతీయ రహదారి పక్కనే నెల్లూరు, ప్రకాశం జిల్లాలకు అందుబాటులో నిర్మించ తలపెట్టిన ఈ విమానాశ్రయానికి టీడీపీ నేతల ధనదాహం, భూ అక్రమాలే శాపంగా పరిణమించాయి. వీరు సృష్టించిన అడ్డంకులతో భూసేకరణకు అవాంతరాలు ఏర్పడ్డాయి. అప్పట్లోనే ఎయిర్‌పోర్టు నిర్మాణానికి భూములిచ్చిన కొందరు రైతులు బతుకుదెరువు కోల్పోయి నేడు పాలేర్లుగా మారారు. తాజాగా దీనిపై కేంద్ర ప్రభుత్వం ప్రకటన చేస్తూ అబ్‌స్టికల్ లిమిటేషన్ సర్ఫేసెస్ (ఓఎల్‌ఎస్) సర్వే రిపోర్టును బట్టి అక్కడ తదుపరి కార్యాచరణ ఉంటుందని తెలిపింది.

కావలి: జిల్లాలో అప్పుడప్పుడే పారిశ్రామికాభివృద్ధికి బుడిబుడి అడుగులు పడుతున్నాయి. ఆ క్రమంలోనే అప్పటి ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి 2008లో దగదర్తి వద్ద విమానాశ్రయం నిర్మిస్తానని ప్రకటించారు. కానీ పారిశ్రామికాభివృద్ధి జరుగుతున్నా.. ఎయిర్‌పోర్టు పనులు మాత్రం ఒక్క అడుగు కూడా ముందుకు పడలేదు. జాతీయ రహదారిని ఆనుకుని రవాణాకు సౌకర్యంగా ఉండేలా కావలి నియోజకవర్గంలోని దగదర్తి మండలం దామవరం వద్ద విమానాశ్రయ నిర్మాణానికి అధికారులు ప్రణాళికలు రూపొందించారు. 2,300 ఎకరాల్లో అంతర్జాతీయ ప్రమాణాలతో విమానాశ్రయం నిర్మించేలా డీపీఆర్ కూడా సిద్ధం చేశారు. ఈ సమయంలో దురదృష్టవశాత్తు ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి అకాల మరణం తర్వాత విమానాశ్రయ ప్రతిపాదనలు మూలన పడ్డాయి. 2014 ఎన్నికల్లో దగదర్తి విమానాశ్రయాన్ని టీడీపీ ఎన్నికల అస్త్రంగా వాడుకుంది. టీడీపీ అధికారంలోకి రావడంతో స్థానిక టీడీపీ నేతలు ప్రభుత్వ, ప్రైవేట్ భూముల రికార్డులను తారుమారు చేసి భూ అక్రమాలకు తెరతీశారు. ఈ పరిణామాలతో ఒక దశలో ఎయిర్‌పోర్టు మరో ప్రాంతానికి తరలించాలని అప్పటి టీడీపీ ప్రభుత్వం భావించిందంటే ఏ స్థాయిలో టీడీపీ నేతలు భూఅక్రమాలకు పాల్పడ్డారో అర్థం చేసుకోవచ్చు. అధికారంలో ఉన్న ఐదేళ్లూ ఏమి చేయలేక చేతులెత్తేసిన టీడీపీ ప్రభుత్వం ఎన్నికల నోటిఫికేషన్‌కు నెల ముందు నిధులు కేటాయించకుండానే ఉత్తుత్తి శంకుస్థాపన చేసి చేతులు దులుపుకుంది. ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఈ ప్రాజెక్ట్‌ను కార్యరూపం దాల్చేందుకు ఎన్నో ప్రయత్నాలు చేసినా.. భూ అక్రమాలు, కోర్టు కేసుల ఫలితంగా ఒక్క అడుగు ముందుకు వేయలేని పరిస్థితి ఏర్పడింది.

17 ఏళ్ల తర్వాత కొత్త సర్వే మెలిక

సుమారు 17 ఏళ్ల నుంచి జిల్లా ప్రజలను ఊరిస్తున్న దామవరంలో విమానాశ్రయ నిర్మాణానికి కొత్తగా మరో సర్వే చేయాలని కేంద్ర ప్రభుత్వం మెలిక పెట్టింది. ఈ సర్వే ఎప్పుడు ప్రారంభమవుతుందో, ఆ నివేదిక ఏమి చెబుతుందో తెలియని పరిస్థితి. ఇప్పటికే భూసేకరణ చేసిన తర్వాత ఈ సర్వే ఏమిటనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. విమానాశ్రయ నిర్మాణానికి ఇప్పటికే 1,379 ఎకరాలు అధికారులు సేకరించారు. అందులో 669 ఎకరాలకు పరిహారం చెల్లించి భూములు స్వాధీనం చేసుకున్నారు. మరో 710 ఎకరాలకు పరిహారం చెల్లించాల్సి ఉంది. పరిహారం తీసుకుని విమానాశ్రయం కోసం భూములిచ్చిన రైతులు ఇప్పుడు పాడి రైతులుగా, పాలేర్లుగా పనిచేస్తున్నారు. భూసేకరణ జాబితాలో ఉన్న భూములకు పరిహారం ఇప్పటి రేట్లు ప్రకారం పెంచాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

ఓఎల్‌ఎస్ సర్వే ఎందుకు?

అబ్‌స్టికల్ లిమిటేషన్ సర్ఫేసెస్ (ఓఎల్‌ఎస్) సర్వే అవసరం ఎందుకు?. సివిల్ ఏవియేషన్ సేఫ్టీ అథారిటీ ఆమోదించిన అంతర్జాతీయ స్పెసిఫికేషన్ల ప్రాతిపదికగా ఓఎల్‌ఎస్ సర్వే జరుగుతుంది. విమానాశ్రయంతోపాటు దాని చుట్టూ ఉన్న గగనతలంలో విమానానికి ఉన్న అడ్డంకులు గుర్తించడం, విమాన కార్యకలాపాలను సురక్షితంగా నిర్వహించడానికి, భవిష్యత్‌లో అడ్డంకులు తలెత్తే పరిస్థితులను అంచనా వేసి నివారణ చర్యలు తీసుకోవడం, విమానాశ్రయం నిర్వహణకు అవరోధాలు తెలుసుకునే ప్రక్రియకు ఉపయోగపడుతుంది. ఈ సర్వే విమానాశ్రయ సాంకేతిక తనిఖీ (ఏటీఐ)లో భాగం. విమానాశ్రయంలో విమానాలు సురక్షితమైన టేకాఫ్‌లు, ల్యాండింగ్‌లను ఓఎల్‌ఎస్ సాంకేతిక నివేదికలను తెలియజేస్తోంది.

ఎంపీ గారు.. ఎక్కడా నిర్మాణ పనులు?

ఫిబ్రవరి 21వ తేదీ దామవరంలోని విమానాశ్రయ భూములను సందర్శించిన ఎయిర్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఢిల్లీ) (ఏఏఐ) అత్యున్నత స్థాయి అధికారులతో కలిసి వచ్చిన నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ ఈ రోజు నుంచి విమానాశ్రయం నిర్మాణ పనులు మొదలైనట్లే అని ప్రకటించారు. అక్కడే ఉన్న రాజ్యసభ సభ్యుడు బీద మస్తాన్‌రావు, కావలి ఎమ్మెల్యే డీవీ కృష్ణారెడ్డి విమానాశ్రయ నిర్మాణ వేగంగా పూర్తి చేయిస్తామని ప్రకటించారు. కానీ ఇప్పటికీ ఒక్క అడుగుకూడా ముందుకు పడకపోవడం విశేషం.



విమానాశ్రయం నిర్మించే ప్రాంతంలోని భూములు



ఇప్పుడు ఎకరం రూ.50 లక్షలు

అప్పుడెప్పుడో విమానాశ్రయం నిర్మాణం కోసం భూములు కావాలన్నారు. మా కుటుంబానికి చెందిన భూములు తీసుకుంటామని చెప్పారే కానీ తీసుకోలేదు. అప్పట్లో ఎకరాకు రూ.13 లక్షలు, రూ.18 లక్షలు చొప్పున నష్ట పరిహారం ఇచ్చారు. ఇప్పుడు ఇక్కడ భూముల ధరలు రూ.50 లక్షలు పెట్టినా ఇచ్చే వాళ్లు లేరు. భూములకు పాత ధరలతో నష్టపరిహారం చెల్లిస్తామంటే ఏ రైతు ఒప్పుకునే పరిస్థితి లేదు. సెంటు భూమి కూడా ఇవ్వరు.

– పెద్దినేని వెంకయ్య, రైతు, దామవరం, దగదర్తి మండలం



ఎయిర్‌పోర్టు నిర్మాణం అవసరం

దామవరం ఎయిర్ పోర్ట్ నెల్లూరు, ప్రకాశం జిల్లా వాసులకు అత్యంత ఆవశ్యకం. పోర్టులు, పరిశ్రమలతో పాటు వ్యాపార పరంగా సుదూర ప్రాంతాలకు ప్రయాణాలు చేసే వారి సంఖ్య గణనీయంగా పెరిగింది. కాబట్టి ఎయిర్‌పోర్టు అవసరం. మన ప్రజాప్రతినిధుల చొరవతో కేంద్రం దగదర్తికి ఎయిర్‌పోర్టు అథారిటీ ఆఫ్ ఇండియా బృందాన్ని పరిశీలనకు పంపాలి. ఎయిర్‌పోర్టు కార్యకలాపాలు వెంటనే మొదలు పెట్టాలి.

– కూనం తాతిరెడ్డి ఉపాధ్యక్షుడు, రైల్ అండ్ రోడ్ ప్యాసింజర్స్ అసోసియేషన్, కావలి

రైతుల్ని దోచేస్తున్న దళారులు, మిల్లర్లు



దమ్మాయపాళెంలో వరి ధాన్యం రాసులను పరిశీలిస్తున్న మాజీ మంత్రి కాకాణి

- అధికారుల ప్రకటనలకు.. వాస్తవాలకు పొంతనలేదు
- మా ప్రభుత్వ హయాంలో పుట్టి రూ.25 వేలు
- కూటమి ప్రభుత్వంలో రూ.15 వేలు
- మాజీ మంత్రి కాకాణి ధ్వజం

ముత్తుకూరు: కూటమి ప్రభుత్వంలో అటు మిల్లర్లు, ఇటు దళారులు రైతుల్ని దోచేస్తున్నారని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి మండిపడ్డారు. మండలంలోని దమ్మాయపాళెంలో మంగళవారం వరి ధాన్యం రాసులను పరిశీలించారు. రైతులతో సమావేశమై వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ పాలనలో పుట్టి (850 కిలోలు) ధాన్యాన్ని రైతులు రూ.25,000లకు అమ్మకం చేసుకోగా, కూటమి ప్రభుత్వంలో రూ.15,000లకు పడిపోయిందని విచారం వ్యక్తం చేశారు. ఎకరాకు రూ.40,000 నష్టపోతున్నారన్నారు. వరి కోతలు ముమ్మరమైతే ధరలు మరింత దిగజారే ప్రమాదం ఉందన్నారు. రైతులు ఈ స్థాయిలో నష్టపోతుంటే.. కారణాలు అన్వేషించి చర్యలు తీసుకోవాల్సిన ప్రభుత్వం చోద్యం చూస్తుందని దుయ్యబట్టారు. దీన్ని బట్టి రైతులపై కూటమి ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధి తెలుస్తోందన్నారు. మిల్లర్లు పుట్టి ధాన్యానికి ధర ఇస్తూ రైతు నుంచి తరుగు పేరుతో అదనంగా 150 కిలోల ధాన్యాన్ని దోచేస్తున్నారని విమర్శించారు. పేరుకు 300 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తే, ఒక్క చోట కూడా ధాన్యం కొనుగోలు చేసే పరిస్థితి లేదన్నారు. జిల్లా అధికారుల ప్రకటనలకు, వాస్తవాలకు పొంతన లేదన్నారు. ఉత్తుత్తి ప్రకటనలు కట్టి పెట్టి క్షేత్రస్థాయిలో రైతుల కష్టాలు పరిశీలించి, సమస్యలు పరిష్కరించాలన్నారు.

సోమిరెడ్డికి కమీషన్లపైనే దృష్టి

సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ముడుపులు, కమీషన్లు, వసూళ్లపై దృష్టి పెట్టారని, రైతుల కష్టాలు పట్టించుకునే స్థితిలో లేడని కాకాణి ఆగ్రహం వెలిబుచ్చారు. రైతుల పక్షాన ఉంటూ న్యాయం జరిగే వరకు పోరాడుతామన్నారు. పార్టీ కన్వీనర్ మెట్టు విష్ణువర్ధన్‌రెడ్డి, ఎంపీపీ గండవరం సుగుణ, నాయకులు దువ్వూరు చంద్రశేఖర్‌రెడ్డి, పోచారెడ్డి చెంగారెడ్డి, సన్నారెడ్డి దయాకర్‌రెడ్డి, సర్పంచ్ సన్నారెడ్డి హారతి, ఎంపీటీసీ సభ్యులు మూగ కీర్తి, పాముల శ్రీనివాసులు, దువ్వూరు కోదండరామరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

16 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు

నెల్లూరు రూరల్: జిల్లాలో మంగళవారం 2,500 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేశామని జేసీ కార్తీక్ ఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పటి వరకు మొత్తం 16 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించామన్నారు. రూ.33 కోట్లు రైతులకు చెల్లించినట్లు తెలిపారు. దళారుల మాటలు విని తక్కువ ధరకు అమ్ముకోవద్దని రైతులకు సూచించారు.

పీఎంశ్రీ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు

నెల్లూరు (టౌన్): పీఎంశ్రీకు ఎంపికైన పాఠశాలల్లో పూర్తిస్థాయిలో మౌలిక సదుపాయాలను కల్పించాలని సమగ్రశిక్ష అడిషనల్ స్టేట్ ప్రాజెక్ట్ డైరెక్టర్ రవీంద్రనాథ్‌రెడ్డి తెలిపారు. మంగళవారం బుచ్చిరెడ్డిపాళెం మండలం రేబాల జెడ్పీ ఉన్నత పాఠశాల, కోవూరు జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ పాఠశాలల్లో పాల్ ల్యాబ్ నిర్వహణ, మౌలిక వసతులు, కెమిస్ట్రీ ల్యాబ్ నిర్మాణం, క్రీడా సముదాయం కోర్టుల ఏర్పాటు, అటల్ టింకరింగ్ ల్యాబ్ వినియోగం, విద్యార్థి అభ్యసన సామర్థ్యాలు, స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర అమలు తీరు తదితరాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో సమగ్రశిక్ష ఏపీసీ వెంకటసుబ్బయ్య, ఏఎంఓ సుధీర్ బాబు, పాల్ నోడల్ ఆఫీసర్ ప్రసాద్, ఎంఈఓలు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లపై చర్చ

- మంత్రి నాదెండ్లతో మంత్రులు, ఎమ్మెల్యేల భేటీ



జిల్లా మంత్రులు, ఎమ్మెల్యేలతో మాట్లాడుతున్న మంత్రి నాదెండ్ల

నెల్లూరు రూరల్: పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ జిల్లా మంత్రులు, ఎమ్మెల్యేలతో అసెంబ్లీలోని తన చాంబర్‌లో మంగళవారం సమావేశమయ్యారు. జిల్లాలో ధాన్యం కొనుగోలు పరిస్థితి, రైతులు ఎదుర్కొంటున్న సమస్యలు, పరిష్కార మార్గాలపై చర్చించారు. మంత్రి నాదెండ్ల మనోహర్ మాట్లాడుతూ ఇప్పటి వరకు జిల్లాలో 15 వేల టన్నుల పైగా ధాన్యం కొనుగోలు చేసామని తెలిపారు. ధాన్యం కొనుగోలు జరిగిన 24 గంటల్లోపే రైతుల ఖాతాల్లో నగదు జమ అవుతుందని తెలిపారు. రైతు సేవా కేంద్రాల ద్వారా కొనుగోలు కొనసాగుతుందని, గన్నీ బ్యాగులు, ట్రాన్స్‌పోర్ట్ సౌకర్యాలు అందుబాటులో ఉంచామని తెలిపారు. మిల్లర్స్‌తో చర్చించి ధాన్యం కొనుగోలు పకడ్బందీగా జరిగేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. తేమ శాతం 17–20 ఉన్న ధాన్యాన్ని సైతం రైతులకు ఇబ్బంది లేకుండా కొనుగోలు చేస్తామన్నారు. ఏఐ ద్వారా ధాన్యం అమ్మకం మరింత సులభతరం చేసేందుకు 7337359375 నెంబరుకు హాయ్ మెసేజ్ పంపితే రైతులు ధాన్యం అమ్మకం వివరాలు తెలుసుకోవచ్చని వెల్లడించారు. ఈ సమావేశంలో మున్సిపల్ శాఖ మంత్రి పి నారాయణ, దేవదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి మహమ్మద్ ఫరూక్, ఎమ్మెల్యేలు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి, కె రామకృష్ణ, దగుమాటి వెంకట కృష్ణారెడ్డి, పౌరసరఫరాల సంస్థ ఎండీ మన్జూర్ పాల్గొన్నారు.

ఉపాధి పనుల్లో రూ.3.70 కోట్ల అవినీతి

- రికవరీకి ఆదేశించిన మొత్తం రూ.37.80 లక్షలే
- 16 మంది ఉపాధి సిబ్బంది, అధికారులపై సస్పెన్షన్ వేటు



ఫీల్డ్ అసిస్టెంట్‌ను అవకతవకలపై ప్రశ్నిస్తున్న డ్వామా పీడీ

ఉదయగిరి: మండలంలో జరిగిన ఉపాధి పనుల్లో భారీగా అవినీతి జరిగిందని సోషల్ ఆడిట్ తనిఖీల్లో నిగ్గు తేల్చితే.. చివరకు అధికారులు ఈ మొత్తాన్ని కుదించి పది శాతానికి తగ్గించారు. ఆయా పనుల్లో అవినీతి, అక్రమాలకు పాల్పడిన 16 మంది అధికారులు, సిబ్బందిపై సస్పెన్షన్ వేటు పడిదంటే.. ఏ స్థాయిలో అవినీతి జరిగిందో ఈ చర్యలే అద్దం పడుతున్నాయి. ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో మంగళవారం 17వ విడత సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహించారు. 2023 ఏప్రిల్ నుంచి 2024 మార్చి వరకు మండలంలో ఉపాధి హామీ పథకం కింద రూ.14.08 కోట్ల పనులు చేపట్టారు. వాటికి సంబంధించి క్షేత్రస్థాయిలో సామాజిక తనిఖీ బృందాలు తనిఖీ చేయగా బినామీ మస్తర్లు, చనిపోయిన వారి పేర్లతో నగదు స్వాహా, పనుల్లో కొలతల్లో తేడా, డబుల్ జాబ్‌కార్డులు, అవెన్యూ ప్లాంటేషన్‌లో అవినీతి, రికార్డులు మాయం చేయడం, ఉద్యోగులు, వలంటీర్ల పేరుతో మస్తర్లు, ఒకే కుటుంబంలో వివిధ జాబ్‌కార్డులు సృష్టించడం, నేమ్‌బోర్డు లేకుండానే నిధులు స్వాహా, తదితర అవినీతి అక్రమాలు గుర్తించారు. మండలంలోని 17 పంచాయతీల్లో రూ.3.70 కోట్ల మేర అవినీతి జరిగినట్లుగా లెక్క తేల్చారు. డ్వామా పీడీ గంగాభవాని సమక్షంలో జరిగిన ప్రజా వేదికలో సామాజిక తనిఖీ బృందం పంచాయతీల వారీగా జరిగిన అవినీతి, అక్రమాలను బయటపెట్టారు. అయితే అటు చేసి.. ఇటు చేసి రూ.37.80 లక్షల అవినీతి జరిగినట్లుగా లెక్క తేల్చారు. మరో రూ.98 లక్షలకు సంబంధించి రికార్డులు మాయం కావడంతో అందుకు బాధ్యులైన వారిపై కేసులు నమోదు చేయాల్సిందిగా ఎంపీడీఓ అప్పాజీని డ్వామా పీడీ ఆదేశించారు. ఈ అవినీతి, అక్రమాల్లో ప్రమేయమున్న ఏపీఓ శ్రీనివాసులు, ఈసీలు వెలుగోటి శ్రీనివాసులు, మురళీకృష్ణ, కంప్యూటర్ ఆపరేటర్లు సుహాసిని, రఫీ, టెక్నికల్ అసిస్టెంట్లు మనోజ్, రామకృష్ణ, కాలె శ్రీనివాసులుతో పాటు 9 మంది క్షేత్ర సహాయకులను సస్పెండ్ చేస్తూ పీడీ ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అంబుడ్స్‌మెన్ వెంకటరెడ్డి, జిల్లా విజిలెన్స్ అధికారిణి విజయలక్ష్మి, జిల్లా క్వాలిటీ కంట్రోల్ అధికారి సతీష్‌బాబు, ఇన్‌చార్జి ఏపీడీ శంకరనారాయణ, ఎంపీడీఓ అప్పాజీ తదితరులు పాల్గొన్నారు.

రికవరీకి ఆదేశించిన మొత్తాలు

ఉదయగిరిలో రూ.2,98,788, కొండాయపాళెం రూ.2,61,763, పుల్లాయపల్లి రూ.9,28,320, ఆర్లపడియ రూ.4,14,074, బండగానిపల్లి రూ.1,53,811, దాసరపల్లి రూ.17,200, శకునాలపల్లి రూ.41,147, నేలటూరు రూ.29,400, తిరుమలాపురం రూ.2,71,774, వెంగళరావునగర్ రూ.2,31,071, జి.అయ్యవారిపల్లి రూ.2,42,066, జి.చెరువుపల్లి రూ.78,011, గండిపాళెం రూ.61,427, జి.చెర్లోపల్లి రూ.2,252, అప్పసముద్రం రూ.5,40,000, కృష్ణంపల్లి రూ.2,72,064, గన్నేపల్లి రూ.2,500 అవినీతి జరిగినట్లుగా తేల్చి రికవరీకి ఆదేశించారు.

ఆశిస్తున్న ధర లభించేనా?

- నేటి నుంచి కలిగిరి, డీసీపల్లి కేంద్రాల్లో పొగాకు వేలం ప్రక్రియ ప్రారంభం
- సాగు సమయంలో పెరిగిన పెట్టుబడులు
- సరాసరిన రూ.300 ఇవ్వాలని రైతుల డిమాండ్


పొగాకు గ్రేడింగ్ పని చేస్తున్న మహిళలు

కలిగిరి: జిల్లాలోని కలిగిరి, మర్రిపాడు మండలంలోని డీసీపల్లి పొగాకు వేలం కేంద్రాల్లో బుధవారం నుంచి వేలం ప్రారంభమవుతుంది. వాటి పరిధిలో 2,963 బ్యారెన్ల ద్వారా 3,469 మంది రైతులు పొగాకు సాగు చేపట్టారు. 2025 – 26 సీజన్‌కు సంబంధించి 12.65 మిలియన్ కేజీల పొగాకును అధికారికంగా అమ్ముకోవడానికి బోర్డు అనుమతి ఉంది. పెరిగిన సాగు విస్తీర్ణం, అధిక దిగుబడుల దృష్ట్యా 18.30 మిలియన్ కేజీల వరకు ఈ సీజన్‌లో అమ్మకాలు జరగొచ్చని అధికారులు అంచనా వేస్తున్నారు.

జాగ్రత్తలు తప్పనిసరి

పొగాకు గ్రేడింగ్ సమయంలో రైతులు తప్పనిసరిగా జాగ్రత్తలు పాటించాలని బోర్డు అధికారులు సూచిస్తున్నారు. ఈ ఏడాది పొగాకు నాణ్యత ఆశాజనకంగా ఉంది. మొత్తం ఉత్పత్తిలో 50 శాతం వరకు మొదటి రకం (బ్రైట్ గ్రేడ్) వచ్చినట్లు రైతులు, అధికారులు చెబుతున్నారు. మిగిలిన గ్రేడ్ ఉత్పత్తులు కూడా బాగున్నట్లు తెలుస్తోంది.


క్యూరింగ్ అయిన పొగాకు

భారీగా పెరిగిన పెట్టుబడులు

ఈ ఏడాది పొగాకు సాగుకు పెట్టుబడులు భారీగా పెరిగాయి. గత రెండు సంవత్సరాలుగా మంచి ధరలు లభిస్తుండటంతో ఈసారి సాగు చేయడానికి రైతులు అమితంగా ఆసక్తి చూపారు. దీంతో ఈ ప్రాంతంలో పొలాలు, బ్యారెన్ల కౌలు ధరలు అమాంతం పెరిగిపోయాయి. గతేడాది రూ.లక్ష ఉన్న బ్యారెన్ కౌలు ఈసారి రూ.2.50 లక్షల నుంచి రూ.3 లక్షల వరకు పలికింది. పొలం కౌలు, కూలీల రేట్లు కూడా దాదాపు రెట్టింపయ్యాయి. గతంతో పోలిస్తే ఈ ఏడాది ఒక్కో బ్యారెన్‌కు రూ.4 లక్షల నుంచి రూ.5 లక్షల వరకు ఖర్చులు పెరిగాయి. ప్రస్తుతం కందుకూరు–1లో వేలం జరుగుతుండగా గరిష్ట ధర కిలోకు రూ.280 పలికింది. పెరిగిన పెట్టుబడుల నేపథ్యంలో ఈ ఏడాది రూ.300 లభించేలా చూడాలని కలిగిరి, డీసీపల్లి వేలం కేంద్రాల పరిధిలోని రైతు లు డిమాండ్ చేస్తున్నారు.

కలిగిరి, డీసీపల్లి వేలం కేంద్రాల పరిధిలో..

రైతులు	: 3,469
బ్యారెన్లు	: 2,963
బోర్డు అనుమతించిన సాగు విస్తీర్ణం	: 9,931 హెక్టార్లు
రైతులు సాగు చేసిన విస్తీర్ణం	: 9,973 హెక్టార్లు
బోర్డు అనుమతించిన ఉత్పత్తి	: 12.65 మిలియన్ కేజీలు
రైతులు పండించిన ఉత్పత్తి (అంచనా)	: 18.30 మిలియన్ కేజీలు

సూచనలు పాటించాలి



ఈ ఏడాది పొగాకు పంట దిగుబడులు ఆశాజనకంగా ఉన్నాయి. రైతులు అవశేషాలు లేని, హీట్ లేకుండా గ్రేడ్‌ల ఆధారంగా బేళ్లను తయారు చేసుకోవాలి. పొగాకు బోర్డు అధికారుల సూచనలు పాటిస్తే మంచి ధరలు లభించే అవకాశం ఉంది.

– మహేష్ కుమార్, వేలం నిర్వహణాధికారి, కలిగిరి పొగాకు బోర్డు

పెట్టుబడులు పెరిగాయి



ఈ ఏడాది పెట్టుబడులు భారీగా పెరిగాయి. సీజన్ ప్రారంభం నుంచే మంచి ధరలు లభిస్తాయని ఎదురు చూస్తున్నాం. సరాసరిన కిలో రూ.300 తగ్గకుండా ఉంటేనే రైతులు గట్టున పడతారు.

– పూసాల అక్కపునాయుడు, రావులకొల్లు, కలిగిరి మండలం

నాలుగో అంతస్తు నుంచి పడి..

- బేల్దారి మృతి

నెల్లూరు(క్రైమ్): భవన ఎలివేషన్ పనులు చేస్తున్న బేల్దారి ప్రమాదవశాత్తు కాలుజారి మరో బిల్డింగ్‌పై పడి మృతిచెందాడు. ఈ ఘటన నెల్లూరులోని బృందావనంలో జరిగింది. పోలీసుల కథనం మేరకు.. కోవూరు మండలం పోతిరెడ్డిపాళేనికి చెందిన రాము (51), నరసమ్మ దంపతులకు కుమారుడు, కుమార్తె ఉన్నారు. రాము బేల్దారి పనులు చేస్తుంటాడు. ఆ కుటుంబం కొంతకాలంగా నెల్లూరు రూరల్ మండలం కొత్తూరు వైఎస్సార్ నగర్‌లో ఉంటోంది. రాము మంగళవారం బృందావనంలో సురేష్‌కు చెందిన భవన ఎలివేషన్ పనులకు వెళ్లాడు. కర్రలు కట్టి నాలుగో అంతస్తు ఎలివేషన్ పనులు చేస్తుండగా ప్రమాదవశాత్తు కాలుజారి తూర్పువైపునున్న బిల్డింగ్‌పై పడి తీవ్రంగా గాయపడ్డాడు. సహచరులు అతడిని చికిత్స నిమిత్తం రామచంద్రారెడ్డి హాస్పిటల్‌కు తీసుకెళ్లారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే రాము మృతిచెందాడని నిర్ధారించారు. మృతుడి బంధువు నారాయణరావు ఫిర్యాదు మేరకు సంతపేట పోలీసులు కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని జీజీహెచ్ మార్చురీకి తరలించారు. ఎస్సై బాలకృష్ణ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

గొర్రెల దొంగతనంపై ఫిర్యాదు

నెల్లూరు సిటీ: రూరల్ మండలంలోని ఆమంచర్ల గ్రామంలో లక్ష్మీనారాయణ అనే వ్యక్తికి చెందిన మూడు గొర్రెలను సోమవారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లారని రూరల్ పోలీసులకు మంగళవారం ఫిర్యాదు అందింది. తన ఇంటి వద్ద మందలో ఉన్న మూడు గొర్రెలను దొంగలు తీసుకెళ్లారని నారాయణ ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

క్లుప్తంగా

తెలుగు అధ్యాపకుల నిరసన


నిరసన తెలుపుతున్న అధ్యాపకులు

నెల్లూరు(టౌన్): 'ఇంటర్ బోర్డు చేపట్టిన సంస్కరణల్లో భాగంగా ఎప్పటి నుంచో ద్వితీయ భాషగా ఉన్న తెలుగును ఆప్షనల్ చేయడం దారుణం. ఇది ఆ భాషను అవమానించడమే' అని తెలుగు అధ్యాపకులు ఆవేదన వ్యక్తం చేశారు. నెల్లూరు స్టోన్‌హౌస్‌పేటలోని కేఏసీ జూనియర్ కళాశాలలో జరుగుతున్న మూల్యాంకనం వద్ద మంగళవారం నల్లబ్యాడ్జీలతో నిరసన తెలిపారు. అనంతరం క్యాంప్ ఆఫీసర్ ఎ.శ్రీనివాసులుకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో అధ్యాపకులు రమేష్, వెంకట్రావు, పులి చెంచయ్య, శ్రీనివాసులు, ఆశీర్వాదం, సోమశేఖర్, వనజ, సరళ, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం లారీ బోల్తా


ఘటనా స్థలంలో లారీ

ఆత్మకూరు: ధాన్యం లోడ్‌తో వెళ్తున్న లారీ అదుపుతప్పి పొలాల్లో బోల్తా పడిన ఘటన మంగళవారం జరిగింది. స్థానికుల కథనం మేరకు.. మున్సిపల్ పరిధిలోని 9వ వార్డు అనంతరాయనియేని గిరిజన కాలనీ వద్ద పొలాల్లో లారీలో ధాన్యం బస్తాలు లోడ్ చేయగా నెల్లూరుకు బయలుదేరింది. ఈ క్రమంలో డొంకరోడ్డు కొంతమేర కుంగి ఉండటంతో లారీ అదుపుతప్పి పొలాల్లో బోల్తా పడింది. ఈ ఘటనలో డ్రైవర్, క్లీనర్ గాయపడగా వారిని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ధాన్యం బస్తాలు అన్ని పొలాల్లో చెల్లాచెదురుగా పడిపోయాయి. దీంతో మరో లారీలో లోడ్ చేసి తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

తల్లిదండ్రులకు కన్నీరు మిగిల్చి..

- రోడ్డు ప్రమాదంలో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ మృతి


దినేష్ (ఫైల్)

వలేటివారిపాలెం: రోడ్డు ప్రమాదంలో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ మృతిచెందిన ఘటన మండలంలోని పోకూరు ఆక్స్‌ఫర్డ్ స్కూల్ వద్ద వే బ్రిడ్జి సమీపంలో 167–బీ జాతీయ రహదారిపై మంగళవారం జరిగింది. పోలీసుల కథనం మేరకు.. మండలంలోని శింగమనేనిపల్లి గ్రామానికి చెందిన బాశం వెంకటేశ్వర్లు – మాధవి దంపతుల కుమారుడు బాశం దినేష్ (25) వర్క్ ఫ్రం హోం చేస్తున్నాడు. అంతేకాకుండా తల్లిదండ్రుల వ్యవసాయ పనుల్లో చేదోడువాదోడుగా ఉన్నాడు. బడేవారిపాళెం నుంచి పొలం అరక దున్నే కూలీని తీసుకురావాలని తండ్రి వెంకటేశ్వర్లు కుమారుడికి చెప్పాడు. దీంతో తన బుల్లెట్‌పై బయలుదేరిన దినేష్‌కు ఊరు దాటగానే తండ్రి ఫోన్ చేసి అమ్మకి ఆరోగ్యం బాగోలేదు.. ముందు పోకూరు వెళ్లి మందులు తీసుకొని అక్కడి నుంచి బడేవారిపాళెం వెళ్లమని చెప్పాడు. దినేష్ మందులు తీసుకుని బడేవారిపాళెం వెళ్తున్నాడు. హైవేపై ముందు వెళ్తున్న కారును ఓవర్ టేక్ చేయబోయి ఎదురుగా కందుకూరు వైపు వస్తున్న ఆటోను ఢీకొట్టాడు. రోడ్డుపై పడిపోయిన దినేష్ తలకు బలమైన గాయమై అక్కడికక్కడే మృతిచెందాడు. సమాచారం అందుకున్న ఎస్సై మరిడి నాయుడు ఘటనా స్థలాన్ని పరిశీలించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కందుకూరు ఏరియా వైద్యశాలకు తరలించారు. అప్పటి వరకు గ్రామంలో ఉత్సాహంగా తిరిగిన దినేష్ మృతితో శింగమనేనిపల్లిలో విషాదం నెలకొంది. వెంకటేశ్వర్లుకు ఒక అబ్బాయి, అమ్మాయి సంతానం. మరో ఆరునెలల్లో దినేష్ అక్కకు వివాహం చేయాల్సి ఉంది. అన్ని తానై చూసుకుంటున్న యువకుడి మృతితో తల్లిదండ్రులు, బంధువులు కన్నీరుమున్నీరవుతున్నారు.

ఆటోలో వెళ్తుండగా..

- కింద పడి చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

ఉదయగిరి: మండలంలోని సున్నంవారిచింతల సమీపంలో మంగళవారం మధ్యాహ్నం ఆటోలో వెళ్తున్న తిరుమలాపురం ఎస్టీ కాలనీకి చెందిన కొండయ్య (48) అనే వ్యక్తి ప్రమాదవశాత్తు జారి కిందపడ్డాడు. తీవ్రంగా గాయపడిన అతడిని స్థానిక ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం నెల్లూరుకు తీసుకెళ్లారు. అక్కడ ఓ ప్రైవేట్ వైద్యశాలలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఇంద్రసేనారెడ్డి తెలిపారు.

నిమ్మ ధరలు (కిలో)



పెద్దవి	: రూ.80
సన్నవి	: రూ.50
పండ్లు	: రూ.30

చంద్రబాబూ.. మహిళలకు పథకాలెప్పుడిస్తారు

- ప్రతి మహిళకు అండగా నిలిచిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి
- వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు లక్ష్మీసునంద



మాట్లాడుతున్న లక్ష్మీసునంద

నెల్లూరు(బారకాసు): మహిళల కోసం ఎప్పటి నుంచి పథకాలను అమలు చేస్తారో సీఎం చంద్రబాబు చెప్పాలని వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు లక్ష్మీసునంద డిమాండ్ చేశారు. నెల్లూరు నగరంలోని డైకస్‌రోడ్డులో ఉన్న పార్టీ జిల్లా కార్యాలయంలో మంగళవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. అసెంబ్లీ వేదికగా మహిళా సాధికారత గురించి చంద్రబాబు మాట్లాడటం దెయ్యాలు వేదాలు వల్లించినట్లుగా ఉందని మండిపడ్డారు. వైఎస్ జగన్ సీఎంగా ఉన్నప్పుడు అనేక సంక్షేమ పథకాలతో మహిళలకు అండగా నిలిచారన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి పది నెలలవుతున్నా మహిళలకు ఉచిత బస్సు ఊసే ఎత్తడం లేదన్నారు. తల్లికి వందనం పథకాన్ని అమలు చేయకుండా నీరుగారుస్తున్నారన్నారు. అలాగే ఆడబిడ్డ నిధికి బడ్జెట్‌లో ఒక్క రూపాయి కేటాయించలేదన్నారు. సున్నావడ్డీ రుణాలు ఎప్పుడిస్తారో ప్రకటన చేయాలన్నారు. ఆశావర్కర్లకు జీతాలు పెంచుతామని, పనిభారం తగ్గిస్తామని చెప్పి నిలువునా మోసం చేశారని చెప్పారు. ఎన్నికల సమయంలో వలంటీర్లకు నెలకు రూ.10 వేలు ఇస్తామన్నారని, ఇప్పుడు ఆ ఉద్యోగమే లేకుండా చేసి వారి కడుపుకొట్టడం న్యాయమా అని కూటమి నేతల్ని ప్రశ్నించారు. 2014 – 19 మధ్య కూడా చంద్రబాబు మహిళలను మోసం చేశారన్నారు. జగన్ దిశ యాప్‌ను తీసుకొస్తే, దానిని నేడు శక్తి యాప్ అంటూ హంగామా చేస్తున్నారన్నారు. జగన్ ప్రవేశపెట్టిన వ్యవస్థలను కాపీ కొడుతున్నారని తెలిపారు. వైఎస్సార్‌సీపీ అధికారంలో ఉన్నప్పుడు మహిళల పేరు మీద ఇళ్ల పట్టాలిచ్చిందన్నారు. నామినేటెడ్ పదవులు, పనుల్లో మహిళలకు 50 శాతం కేటాయించారని చెప్పారు. స్థానిక సంస్థల పదవులను కూడా 50 శాతం వారికే ఇచ్చారన్నారు. చంద్రబాబు హామీలను నెరవేర్చాలని లేనిపక్షంలో వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం పోరాటం చేస్తామన్నారు. సమావేశంలో ఆ పార్టీ రూరల్ నియోజకవర్గ మహిళా, అంగన్‌వాడీ, సాంస్కృతిక విభాగాల అధ్యక్షులు బషీర, శాలిని, శారద, కార్యవర్గ సభ్యురాలు ఫరీదా తదితరులు పాల్గొన్నారు.

నాణ్యతకు మారుపేరు భారతి సిమెంట్


తాపీ మేస్త్రీలకు బ్యాండ్ అందజేస్తున్న ప్రతినిధులు

సంగం: భారతి సిమెంట్ నాణ్యతకు మారుపేరని ఆ సంస్థ సేల్స్ ఆఫీసర్ బాబ్జాన్, సీనియర్ టెక్నికల్ అధికారి ఎస్.భవానీశంకర్ తెలిపారు. మండల కేంద్రమైన సంగంలోని భారతి ట్రేడర్స్ భవన నిర్మాణ మేస్త్రీలు, కార్మికులకు సోమవారం రాత్రి అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అధునాతన పరిజ్ఞానంతో భారతి సిమెంట్ తయారవుతుందన్నారు. కట్టడాలు దీర్ఘకాలం ఉండేందుకు దోహద పడుతుందన్నారు. సిమెంట్ తయారీకి నాణ్యమైన ముడి పదార్థాలను తమ కంపెనీ ఎంచుకుంటుందన్నారు. ఈ సిమెంట్‌తో వేసిన శ్లాబులను ఏడురోజుల అనంతరం కంపెనీ ప్రతినిధులు పరీక్షించి నాణ్యతను మేస్త్రీలు, యజమానులకు వివరిస్తారన్నారు. ఇందుకు సంబంధిత డీలర్ ద్వారా వివరాలు తెలుసుకుని సమాచారం అందిస్తే సరిపోతుందన్నారు. సదస్సుకు హాజరైన మేస్త్రీలు, కార్మికులకు రూ.లక్ష చొప్పున ఉచిత బీమా సదుపాయం కల్పించి బాండ్లను అందజేశారు. కార్యక్రమంలో భారతి ట్రేడర్స్ అధినేత రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ట్రాక్టర్‌ను ఢీకొన్న ట్రావెల్స్ బస్సు

- ఇద్దరికి గాయాలు


దెబ్బతిన్న ట్రావెల్స్ బస్సు

మర్రిపాడు: మండలంలోని డీసీపల్లి పెట్రోల్ బంకు సమీపంలో నెల్లూరు–ముంబై జాతీయ రహదారిపై ఓ ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు ట్రాక్టర్‌ను ఢీకొన్న ఘటన మంగళవారం ఉదయం జరిగింది. పోలీసుల కథనం మేరకు.. బెంగళూరు నుంచి ఏఎస్‌పేటకు వెళ్తున్న ఓ ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు డీసీపల్లి పెట్రోల్ బంకు సమీపంలో ట్రాక్టర్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ట్రాక్టర్‌లోని ఇద్దరు వ్యక్తులకు స్వల్ప గాయాలయ్యాయి. బస్సు ముందు భాగం దెబ్బతింది. క్షతగాత్రులను ఆత్మకూరు జిల్లా వైద్యశాలకు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చంపేస్తానని బెదిరించడంతో..

- రౌడీషీటర్ హత్య కేసులో నిందితుల అరెస్ట్


వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ సింధుప్రియ, చిత్రంలో ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులురెడ్డి

నెల్లూరు(క్రైమ్): రౌడీషీటర్ చింటూ హత్య కేసులో పరారీలో ఉన్న ఆరుగురు నిందితులను పోలీసులు మంగళవారం అరెస్ట్ చేశారు. వారి నుంచి హత్యకు ఉపయోగించిన మారణాయుధాలను స్వాధీనం చేసుకున్నారు. నెల్లూరు వేదాయపాళెం పోలీస్‌స్టేషన్లో నగర డీఎస్పీ పి.సింధుప్రియ, స్థానిక ఇన్‌స్పెక్టర్ వి.శ్రీనివాసులురెడ్డితో కలిసి హత్యకు దారితీసిన పరిస్థితులు, నిందితుల వివరాలను వెల్లడించారు. పాత వేదాయపాళేనికి చెందిన అరవభూమి సుజన్ కృష్ణారెడ్డి అలియాస్ చింటూ (28) రౌడీషీటర్. అతడిపై వివిధ పోలీస్ స్టేషన్లలో కేసులున్నాయి. చింటూకు ఇందిరాగాంధీనగర్‌కు చెందిన కృష్ణసాయి అలియాస్ కిట్టు స్నేహితుడు. వీరి మధ్య విభేదాలున్నాయి. చింటూ గతంలో కిట్టు ఇంటికి వెళ్లి గొడవపడి చంపుతానని అందరిముందు బెదిరించాడు. అవమానంగా భావించిన కిట్టు ఈ విషయాన్ని తన స్నేహితులైన కొత్తూరు రామకోటయ్యనగర్‌కు చెందిన కరిముల్లా, ఇందిరాగాంధీనగర్‌కు చెందిన షేక్ మహ్మద్ బాబా, వెంగళరావ్‌నగర్‌కు చెందిన జి.పవన్, ఫ్రాన్సిస్ అనిక్‌రాజ్ అలియాస్ అనిక్‌రాజ్, మనుబోలు మండలం కోదండరామపురానికి చెందిన కె.సాయితేజకు జరిగిన విషయాన్ని చెప్పాడు. అందరూ కలిసి చింటూ హత్యకు పథక రచన చేశారు.

మాట్లాడాలని పిలిచి..

చింటూ ఇందిరాగాంధీనగర్‌లోని ఓ యువతితో ప్రేమలో ఉన్నాడు. ఆమెను కొందరు ఇబ్బందులు పెడుతుండగా ఆ విషయమై మాట్లాడదామని కిట్టు ఈనెల 14వ తేదీ రాత్రి చింటూను ఇందిరాగాంధీనగర్ రెండో వీధికి పిలిచాడు. అక్కడే కాపుకాసిన నిందితులు చింటూ రాగానే కత్తులతో విచక్షణా రహితంగా నరికి హత్య చేసి పరారయ్యారు. మృతుడి కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు ఇన్‌స్పెక్టర్ వి.శ్రీనివాసులురెడ్డి కేసు నమోదు చేశారు. ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి సాంకేతికత ఆధారంగా నిందితులను గుర్తించారు. మంగళవారం వెంగళరావ్‌నగర్‌లో ఆరుగురిని అరెస్ట్ చేశారు. నిందితులపై త్వరలో రౌడీషీట్లు తెరుస్తామని డీఎస్పీ చెప్పారు.

డ్యూటీ వేశారని రచ్చ రచ్చ

- పంతం నెగ్గించుకునేందుకు టీచర్ పడరాని పాట్లు
- పచ్చ పార్టీ అండతో రెచ్చిపోయిన కొందరు అయ్యోర్లు
- స్పందించని ఉన్నతాధికారులు

సాక్షి టాస్క్ ఫోర్స్: కందుకూరులోని జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో టీచర్ల మధ్య ఆధిపత్య పోరు నడుస్తోంది. ఇది కాస్తా సోషల్ మీడియాలో పోస్టులు పెట్టుకునే వరకు వెళ్లింది. వివరాలిలా ఉన్నాయి. జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో పని చేస్తున్న ఓ ఉపాధ్యాయురాలికి పదో తరగతి పరీక్షల్లో ఉన్నతాధికారులు డ్యూటీ వేశారు. తనకు డ్యూటీ వేయొద్దని చీఫ్ సూపరింటెండెంట్ ద్వారకారాణికి ఆమె తెలిపారు. అయితే వేచి ఉండండి.. ప్రత్యామ్నాయం చూసి పరిశీలిస్తానని చీఫ్ చెప్పారు. ఆ కాసేపు ఓపిగ్గా ఉండలేకపోయిన ఆమె అధికార పార్టీకి మద్దతుగా ఉన్న కొందరు ఉపాధ్యాయులను తీసుకొని ఉన్నతాధికారులతో మాట్లాడుకుని డ్యూటీని రద్దు చేసుకునేందుకు ప్రయత్నం చేశారు.

రచ్చ చేసిన ఉపాధ్యాయురాలి భర్త

ఇంతలోనే ఆ ఉపాధ్యాయురాలి భర్త వచ్చి చీఫ్ సూపరింటెండెంట్‌పై చిందులు వేసి వెళ్లాడు. బడి ఏమైనా నీ సొంతమా అని రచ్చ చేశాడు. పరీక్షల సమయంలో కచ్చితంగా మిమ్మల్ని ఇబ్బంది పెడతానని చెప్పి హెచ్చరించాడు. అతను చెప్పిన విధంగానే సోమవారం పరీక్ష సమయంలో డిపార్ట్‌మెంట్ అధికారి వద్దకు వెళ్లి ఇక్కడ గోవింద్ అనే వ్యక్తి ప్రైవేట్ వ్యక్తిని ఎందుకు ఉంచారని ప్రశ్నించాడు. అతను డ్యూటీ చేస్తున్నాడని, ఐడీ కార్డు కూడా ఉందని చెప్పారు. దీనిని మీడియాలో వేయిస్తానని చెప్పి అతను వెళ్లిపోయాడు. పరీక్ష కేంద్రంలో ప్రైవేట్ వ్యక్తి సెల్‌ఫోన్‌తో హల్‌చల్ చేస్తున్నాడని సోషల్ మీడియాలో వచ్చింది. దీంతో విద్యాశాఖాధికారులు ఆ కేంద్రంలో పరిశీలిస్తే అతడి వద్ద ఫోన్ లేదు. దీనిపై చీఫ్ ద్వారకారాణి వివరణ ఇస్తూ ఇక్కడ ఎలాంటి సెల్‌తో ప్రైవేట్ వ్యక్తి లేరని తెలిపారు. గోవింద్ అనే వ్యక్తి వాచ్‌మెన్‌గా పని చేస్తున్నాడని, అతడిని కార్యాలయం పనులకు ఉపయోగించుకుంటున్నామని తెలియజేసింది.

అసత్య ప్రచారాలు చేస్తూ..

ఇంతటితో ఊరుకోని ఆ టీచర్ల బ్యాచ్ ఎలాగైనా చీఫ్ సూపరింటెండెంట్‌ను ఇబ్బంది పెట్టాలని పేపర్ ఆలస్యంగా ఇచ్చారని, పరీక్ష కేంద్రంలో ఫ్యాన్లు లేవని ప్రచారం మొదలుపెట్టారు. ఈ విషయంలో విద్యాశాఖాధికారులు నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలున్నాయి. వ్యక్తిగత విషయాలను కేంద్రంపై రుద్దుతున్నారని, ఏమైనా ఉంటే ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయాలని విద్యార్థుల తల్లిదండ్రులు అంటున్నారు. కానీ ఆ బ్యాచ్ మాత్రం తమ పంతం నెగ్గించుకునేందుకు ప్రయత్నిస్తోంది. ఉన్నతాధికారులు స్పందించి వారిపై చర్యలు తీసుకోవాలని తల్లిదండ్రులు కోరుతున్నారు. పరీక్షలు ముగిసే వరకు అలాంటి టీచర్లను పరీక్ష కేంద్రాలకు రానివ్వద్దని కోరుతున్నారు.